సాక్షి
కుమురం భీం
మంగళవారం ׀ 30 ׀ జనవరి ׀ 2024

13 మందికి ఉద్యోగాలు

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లా కేంద్రంలోని పీఎంకేకే శిక్షణ కేంద్రంలో సోమవారం మినీ జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ ప్రైవేట్‌ కంపెనీలు 67 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 48 మంది హాజరయ్యారు. వీరిలో 13 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి రవికృష్ణ సూచించారు.

నేటి నుంచి ఆసరా పింఛన్లు

ఆసిఫాబాద్‌అర్బన్‌: నేటి నుంచి ఫిబ్రవరి 5 వరకు ఆసరా పింఛన్లు(వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళలు) పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీవో సురేందర్‌ తెలిపారు. పింఛన్‌ మొత్తం నేరుగా పోస్టల్‌ శాఖ ద్వారా పొందాలని, దళారులను నమ్మొద్దని సూచించారు. పింఛన్‌ మొత్తం రూ.16తో సహ ప్రతినెలా తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
31.2 /17.2

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్‌

13 నుంచి సదరం శిబిరాలు

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఫిబ్రవరి 13 నుంచి మార్చి 26 వరకు సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సురేందర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 13న మూగ, చెవిటి, 15న కంటి చూపు, 20న మానసిక వైకల్యం, 27న ఎముకలు, మార్చి 11న మూగ, చెవిటి, 15న కంటి చూపు, 21న మానసిక వైకల్యం, 26న ఎముకలకు సంబంధించిన శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. క్యాంపులకు హాజరయ్యే దివ్యాంగులు మొదట ప్రాథమిక ఆరోగ్య సేవా కేంద్రం (పీహెచ్‌సీ)లో వికలత్వ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్‌: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌ వేణుకు వినతిపత్రం అందించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు జాఫర్‌ మాట్లాడుతూ విద్యార్థులకు పెండింగ్‌ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలన్నారు. నూతన మండలాల్లో ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, ఇంటర్‌ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించాలని, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సాయి, నాయకులు సతీశ్‌, నవీన్‌ పాల్గొన్నారు.


ఆల్‌ ఇండియా సమ్మె విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: కార్మిక, రైతు, సామన్య ప్రజలను విస్మరించి బడా పారిశ్రామికవేత్తల కోసం చేసిన కేంద్ర ప్రభుత్వ పదేళ్ల పాలనను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 16న చేపట్టిన ఆల్‌ ఇండియా సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌ కోరారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్‌ యార్డులో సోమవారం కార్మికులతో కలిసి సమ్మెకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం స్కీం వర్కర్లకు కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలని, పీఎఫ్‌, ఇన్సూరెన్స్‌, గ్రాట్యుటీ, పెన్షన్‌, రిటైర్మెంట్‌ బెనిఫిట్స్‌ ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. సింగరేణిలోని 4 బొగ్గు గనులను వేలం వేసేందుకు, ఎల్‌ఐసీ వాటాలు అమ్మేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. సీపీఎస్‌ రద్దు చేసి పాత పెన్షన్‌ విధానం అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. జిల్లా అధ్యక్షుడు దివాకర్‌, ఉపాధ్యక్షుడు శంకర్‌, నాయకులు స్వామి, చిరంజీవి, శ్రీనివాస్‌, మోహన్‌, ప్రకాశ్‌, తిరుపతి, సురేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

తునికాకు టెండర్లు పిలవాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: పేదల పొట్టకొట్టే ఆలోచనను తక్షణమే విరమించుకుని తునికాకు టెండర్లు పిలవాలని టీఏజీఎస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ, తునికాకు కళ్లేదార్ల సంఘం, కేవీపీఎస్‌, డీవైఎఫ్‌ఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. శ్రీనివాస్‌ మాట్లాడుతూ తునికాకు సేకరణ ద్వారా 30వేల మంది కూలీలకు లబ్ధి జరుగుతుందని తెలిపారు. పెద్ద పులులు సంచరిస్తున్నాయనే సాకుతో ఈ సీజన్‌లో తునికాకు యూనిట్లను రద్దు చేయాలని ప్రభుత్వానికి అటవీశాఖ సిఫారసు చేయడంతో పేదలు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. 25 యూనిట్ల పరిధిలో పులుల ఆవాసాలు లేవని స్పష్టం చేశారు. అలాగే 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న బోనస్‌ నగదు 6,300 మందికి వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కూశన రాజన్న, మాలాశ్రీ, దామోదర్‌, కాశీనాథ్‌, కమలాకర్‌, శైలేశ్‌, దుర్గం దినకర్‌, కార్తీక్‌, రాజ్‌కుమార్‌, ఆనంద్‌ కుమార్‌, టీకానంద్‌, చిరంజీవి, వివిధ గ్రామాల కూలీలు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే తిరగబడతాం..

- అటవీ అనుమతుల పేరుతో రోడ్డు నిర్మాణాలు ఆపొద్దు
- జెడ్పీ సమావేశంలో అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- పది శాఖలపైనే చర్చ



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆసిఫాబాద్‌: అటవీ అనుమతుల పేరుతో మారుమూల ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం, అభివృద్ధిని అడ్డుకుంటే తిరుగుబాటు తప్పదని జిల్లా ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఉన్న రోడ్లపై రీ బీటీ వేసేందుకు అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్‌, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్‌ టిబ్రేవాల్‌ను ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో సోమవారం జెడ్పీ చైర్మన్‌ కోనేరు కృష్ణారావు అధ్యక్షతన జిల్లా ప్రజాపరిషత్‌ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే, అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి, జెడ్పీ సీఈవో రత్నమాల, జెడ్పీటీసీలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. రెబ్బెన జెడ్పీటీసీ సంతోష్‌ మాట్లాడుతూ 400 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే గోలేటి రిజర్వాయర్‌కు టెండర్లు పూర్తయినా పనులు ఎందుకు ప్రారంభించడం లేదని ఇరిగేషన్‌ ఈఈ గుణవంత్‌రావును ప్రశ్నించారు. వట్టివాగు ప్రాజెక్టు కాల్వలపై పైపులు వేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నా ఇరిగేషన్‌ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన కలెక్టర్‌ పైపులు తొలగించి, వీడియో విజువల్స్‌ను ఎంపీపీ, జెడ్పీటీసీ గ్రూప్‌లో పెట్టాలని ఆదేశించారు. ఆసిఫాబాద్‌ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. 'పంగడిమాదర సమీపంలోని సుంగపూర్‌ వద్ద రీ బీటీ రోడ్డు వేస్తే అటవీశాఖ అధికారులు ఎందుకు అభ్యంతరం చెబుతున్నారు. ఒకటిన్నర కిలో మీటర్ల రోడ్డు పనులు ఆపింద్రు, గతంలో ఉన్న రోడ్డుపైనే బీటీ వేస్తే తప్పేంటి, అటవీశాఖ అధికారుల తీరు మారకుంటే రాత్రికి రాత్రే రోడ్డు వేస్తాం. ప్రజలకోసం దేనికైనా సిద్ధమే. కేసులు పెట్టినా భయపడేది లేదు..' అని మండిపడ్డారు. అడ ప్రాజెక్టు కట్ట బీటలు తేలి ఏడాదిన్నరైనా ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టడం లేదని, మానిక్‌గూడ వద్ద కుడి కాల్వ తెగిందని టెండర్లు పిలిచి జూన్‌లోగా పనులు పూర్తి చేయాలన్నారు. చింతలమానెపల్లి ఎంపీపీ నానయ్య మాట్లాడుతూ అర్కగూడ ప్రాజెక్టు కాల్వలు సక్రమంగా లేకపోవడంతో సాగు నీరందడం లేదన్నారు. మిషన్‌ భగీరథ పైప్‌లైన్‌ అధ్వానంగా మారి రుద్రాపూర్‌, కర్జవెల్లి గ్రామాల్లో తాగు నీరందడం లేదని, వేసవిలోగా సమస్య పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వంలో రూ.800 కోట్లతో మిషన్‌ భగీరథ పనులు చేపట్టామని, చిన్నచిన్న రిపేర్లతో ఏజెన్సీలోని గ్రామాలకు తాగునీరు సరఫరా కావడం లేదని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లాలు రాకపోవడంతో బోర్లకు మోటార్లు బిగిస్తే విద్యుత్‌ బిల్లులు ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. రెండు రోజుల్లో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి, మరమ్మతులు గ్రామ పంచాయతీ నుంచి చేపట్టేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌ హామీ ఇచ్చారు. ఆసిఫాబాద్‌ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్‌ మాట్లాడుతూ జిల్లాలో గత నాలుగున్నర ఏళ్లుగా 100 రోడ్లు అటవీ అనుమతులు లేక నిలిచిపోయాయని తెలిపారు. అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆర్‌అండ్‌బీ ఈఈ పెద్దన్నను నిలదీశారు. అడవి పందులతో పంటలు నష్టపోతే పరిహారం చెల్లించాలని కోరారు. వాంకిడి ఎంపీపీ విమలాబాయి మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఆశ్రమ వసతి గృహంలో 300 మంది విద్యార్థులు ఉన్నారని, భగీరథ నీరు రాక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోను కలెక్టర్‌కు చూపించారు.

సీఎంకు నివేదిక అందజేస్తాం



అభివృద్ధి పనులకు అవసరమైన నిధులకు సంబంధించి పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేసి, ఫిబ్రవరి 2న ఉమ్మడి జిల్లా పర్యటనలో సీఎంకు నివేదిక అందజేస్తాం. జిల్లాలో ప్రారంభమైన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి. ప్రతీ మండలంలో నెలకు రెండుసార్లు అభివృద్ధి సమీక్షా సమావేశాలు నిర్వహించాలి.

– హేమంత్‌ బోర్కడే, కలెక్టర్‌

'భగీరథ'పై వాడీవేడి

భగీరథ నీటి సరఫరాపై చర్చ వాడీవేడిగా జరిగింది. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో సిర్పూర్‌ నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో మిషన్‌ భగీరథ నీరు రావడం లేదన్నారు. రూ.1300 కోట్లు ఖర్చు చేసినా లక్ష్యం నెరవేరలేదన్నారు. సోమినిలో తాగునీరు రావడం లేదని చెప్పగా, స్పందించిన కలెక్టర్‌ ఇక నుంచి ప్రతీ 15 రోజులకు ఒకసారి మండల స్థాయి సమావేశం నిర్వహించి చిన్న చిన్న సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అందవెల్లి బ్రిడ్జి పనులు పూర్తి చేయాలన్నారు. పెంచికల్‌పేట్‌కు అడిషనల్‌ బ్రిడ్జి, లగ్గాం నుంచి పెంచికల్‌పేట్‌కు రోడ్‌కం బ్రిడ్జి మంజూరు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్‌ క్రాస్‌ రోడ్‌ నుంచి ఉట్నూర్‌ వరకు రూ.4 కోట్లతో మంజూరైన మరమ్మతులు ఎందుకు ప్రారంభించడం లేదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రశ్నించారు. గుండి బ్రిడ్జి పూర్తి చేయాలన్నారు. స్పందించిన కలెక్టర్‌ గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన పనులు తప్పా.. ప్రారంభం కాని పనులు నిలిపి వేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయని తెలిపారు. గోలేటి రహదారి నిర్మాణ ప్రారంభోత్సవానికి ఆర్‌అండ్‌బీ అధికారులు తనను ఆహ్వానించలేదని, ప్రోటోకాల్‌ పాటించడం లేదని ఈఈ పెద్దన్నపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీహక్కు పత్రాలిచ్చిన భూముల్లో కూరగాయలు సాగు చేసుకునేందుకు బోర్లు వేసేందుకు అటవీశాఖ అనుమతులివ్వాలని సూచించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు అధికారులు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ఇక నుంచి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని, దీనిపై ఓ సర్క్యులర్‌ జారీ చేస్తామని తెలిపారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో ఐసీయూ పూర్తి చేయాలన్నారు. జెడ్పీ చైర్మన్‌ కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి, జిల్లా అభివృద్ధికి పాటు పడాలన్నారు. కాగా.. 44 శాఖలపై సమీక్ష జరగాల్సి ఉండగా, కేవలం 10 శాఖలతోనే సమావేశం ముగిసింది. సమావేశంలో జెడ్పీటీసీలు అజయ్‌కుమార్‌, తాళ్లపల్లి శ్రీరామారావు, రుద్రం పుష్పలత, అధికారులు, జెడ్పీటీసీలు, కోఆప్షన్‌ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓడిన వారికి ఆహ్వానం ఎందుకు..?



ఎన్నికల్లో ఓడిపోయిన వారిని అభివృద్ధి కార్యక్రమాలకు ఎందుకు ఆహ్వానిస్తున్నారు. ఓడిపోయిన వ్యక్తులతో ఈజీఎస్‌ ప్రతిపాదనలు పంపుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. ప్రోటోకాల్‌ పాటించడం లేదు. అధికారంలో లేని వారిని ఆహ్వానించొద్దు.

– దండె విఠల్‌, ఎమ్మెల్సీ

ప్రభుత్వాసుపత్రిలో సిజేరియన్లు చేయాలి



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు సిజేరియన్‌ ఆపరేషన్లు చేయాలి. ఇక్కడ ఆపరేషన్లు చేయకపోవడంతో నిరుపేదలు మంచిర్యాల, కాగజ్‌నగర్‌కు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు. నెలకు 30 మందిని రెఫర్‌ చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వాసుపత్రిలో సిజేరియన్లు ప్రారంభించాలి.

– పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్‌ ఎమ్మెల్యే

ఒక్క చుక్క రావడం లేదు



జిల్లా కేంద్రంలోని నా ఇంట్లో మిషన్‌ భగీరథ కింద ఒక నల్లా పెట్టారు. ఇప్పటివరకు ఒక్క చుక్క నీరు కూడా రాలేదు. కంచుకోట, చెక్‌పోస్టు, బ్రాహ్మణవాడ, కసాబ్‌వాడి, గుండి రోడ్‌తోపాటు చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. జిల్లా కేంద్రంలోనే ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో చెప్పనవసరం లేదు.

– కోవ లక్ష్మి, ఆసిఫాబాద్‌ ఎమ్మెల్యే

జంతువులను హింసించడం నేరం

- కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌, అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: జంతువులను హింసించడం నేరమని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో రాష్ట్ర జంతు సంక్షేమ సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల సంరక్షణ పక్షోత్సవాల పోస్టర్‌ను సోమవారం జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి సురేశ్‌తో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ జంతువుల సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. అడవులు, సరస్సులు, నదులు, వన్య ప్రాణులతో పర్యావరణాన్ని రక్షించాలని, జీవుల పట్ల కరుణ కలిగి ఉండాలని సూచించారు. పశువులు, ఇతర జంతువులు, పక్షులను నిబంధనల మేరకు తరలించాలని, అక్రమ రవాణాకు పాల్పడితే శిక్షార్హులని పేర్కొన్నారు. ఆవులు, దూడలను వధించడం నిషేధమన్నారు. పశువులు, కోళ్లు, కుక్కలతో పందేలు నిర్వహించడం నేరమన్నారు.

పకడ్బందీగా ప్రయోగ పరీక్షలు



మాట్లాడుతున్న డీఐఈవో శంకర్‌

ఆసిఫాబాద్‌రూరల్‌: ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని డీఐఈవో శంకర్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ప్రాక్టికల్స్‌ నిర్వహణపై సోమవారం అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 1 నుంచి నిర్వహించే ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 23 పరీక్ష కేంద్రాల్లో జనరల్‌ విభాగంలో 2,816 మంది, 1,546 మంది ఒకేషనల్‌ విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో పరీక్ష నిర్వహణ అధికారులు రాజయ్య, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

నర్సన్నబాపు.. ఇకలేడు

- మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా సేవలందించిన నర్సారెడ్డి
- గత కొంత కాలంగా మంచానికే పరిమితం
- హైదరాబాద్‌లో కన్నుమూసిన పొద్దుటూరి
- నివాళులర్పించిన సీఎం, ఇన్‌చార్జి మంత్రి
- ఆయన కుటుంబానికి పరామర్శల వెల్లువ



నిర్మల్‌/సారంగాపూర్‌: నర్సన్నబాపు.. ఈ తరానికి పెద్దగా పరిచయం లేకున్నా.. తమ తండ్రులు, తాతలకు మాత్రం బాగా దగ్గరి బంధమున్న పేరు. నిస్వార్థ సేవకుడిగా, రాజకీయ వారసత్వం పంచని నేతగా, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల ప్రదాతగా ఇప్పటికీ ప్రజల్లో నిలిచి ఉన్న రాజకీయ దిగ్గజం ఆయన. అలాంటి మహానేత పొద్దుటూరి నర్సారెడ్డి సోమవారం వేకువజామున కన్నుమూశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలోనే వృద్ధాప్యం, అనా రోగ్యంతో తుదిశ్వాస విడిచారు. రైతుకుటుంబంలో పుట్టి ఉన్నతవిద్య అభ్యసించి, తెలంగాణ విముక్తి కోసం పోరాడి, రాజకీయవేత్తగా ఎదిగి ప్రజలకు ఆప్తుడిగా మారిన నర్సన్నబాపును జిల్లా యాది చేసుకుంది. 'నీలాంటి నేతలు మళ్లీ దొరకరంటూ.. నర్సన్న ఇక సెలవంటూ..' నివాళులర్పించింది

ఉన్నతవిద్య చదివి..

జిల్లాలోని సారంగాపూర్‌ మండలం మలక్‌చించోలికి చెందిన పొద్దుటూరి గంగారెడ్డి ఏకైక సంతానం నర్సారెడ్డి. 1931 సెప్టెంబర్‌ 22న జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఏ, ఎల్‌ఎల్‌బీ చదివారు. యుక్తవయసులోనే స్వాతంత్య్ర సమరంలో, నిజాం పాలన నుంచి హైదరాబాద్‌ విముక్త పోరాటంలోనూ పాల్గొన్నారు.

వ్యవసాయమంటే ఇష్టం..

నిర్మల్‌ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో నర్సన్నబాపు తనదైన ముద్రవేశారు. ప్రధానంగా ఇక్కడ ఉన్నత విద్య కోసం జూనియర్‌, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయించారు. ఏకైక సంతానమైన నర్సారెడ్డి పుట్టిన కొంతకాలానికే తండ్రి గంగారెడ్డి మరణించారు. దీంతో ఆయన తన చిన్నాన్న, చిన్నమ్మల వద్ద పెరిగారు. రైతుకుటుంబం నుంచి వచ్చిన నర్సారెడ్డికి వ్యవసాయం అంటే అమితాసక్తి. ఈయన హయాంలోనే మలక్‌చించోలిలో వంతెన, స్వర్ణ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు.

రాజకీయ వారసులు లేని నేత..

నర్సారెడ్డికి కౌసల్యాదేవితో వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు. సుదర్శన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, కుమార్తె విజయలక్ష్మి ఉన్నారు. వీరంతా వృత్తిరీత్యా విదేశాల్లో ఉంటున్నట్లు బంధుమిత్రులు తెలిపారు. మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా, ఎంపీగా చేసిన నర్సారెడ్డి కుటుంబం నుంచి రాజకీయ వారసులు లేకపోవడం విశేషం. ఆయన కుమారులెవరూ రాజకీయాల వైపు రాకపోవడం గమనార్హం. నర్సారెడ్డి తెలంగాణ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా, నిబంధనల కమిటీ, ప్రభుత్వ హామీల కమిటీ, విజ్ఞాపనల కమిటీ, సంప్రదింపుల కమిటీల సభ్యుడిగానూ పనిచేశారు. నిర్మల్‌లోని బుధవార్‌పేట్‌లో గల తన నివాసంలో కొంతకాలం ఉన్న తర్వాత ఆయన ఆరోగ్యం సహకరించకపోవడంతో హైదరాబాద్‌ నివాసానికి వెళ్లారు. ప్రస్తుతం అక్కడే ఆయన తుదిశ్వాస విడిచారు.

రాజకీయాల్లో చేరి..

భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరిన నర్సారెడ్డి వివిధ పదవులు, హోదాల్లో పనిచేశారు.

- 1971 నుంచి 1972వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ పీసీసీ అధ్యక్షుడిగా సేవలందించారు.
- 1978 ఎన్నికల తర్వాత అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు మంత్రివర్గంలో నీటిపారుదల శాఖ, రెవెన్యూశాఖ, శాసనసభ వ్యవహారాల శాఖమంత్రిగా పనిచేశారు.
- వరుసగా 1967నుంచి 1982వరకు మూడు పర్యాయాలు గెలిచి హ్యాట్రిక్‌ ఎమ్మెల్యేగా పనిచేశారు.
- 1991లో ఆదిలాబాద్‌ ఎంపీగా, ఒకసారి ఆంధ్రప్రదేశ్‌ శాసనమండలి సభ్యుడిగా పనిచేశారు.

ప్రజల దిగ్భ్రాంతి

సారంగాపూర్‌ మండలంలోని ప్రతీగ్రామం నుంచి ఆయనకు సన్నిహితులు, సంబంధీకులున్నారు. వీరందరికీ నర్సన్నబాపుతో విడదీయలేని అనుబంధం ఉంది. నర్సన్నబాపు హయాంలోనే ప్రస్తుతమున్న సీనియర్‌ నేతలంతా రాజకీయ ఓనమాలు దిద్దారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం

- అదనపు కలెక్టర్‌ వేణు
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ



అధికారులతో కలిసి అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్‌ వేణు

ఆసిఫాబాద్‌అర్బన్‌: ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్‌ దాసరి వేణు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్‌వో కదం సురేశ్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్‌ మండలం ఈదులవాడ గ్రామ శివారులో కొనుగోలు చేసిన భూమిని ధరణి పోర్టల్‌లో మ్యుటేషన్‌ చేయించుకున్నానని, కానీ తన పేరుకు బదులు వేరొకరి పేరు వచ్చిందని దానిని సరిచేయాలని మారిశెట్టి రామ్మూర్తి విన్నవించాడు. ప్రభుత్వ కార్యాలయంలో వాచ్‌మెన్‌గా పని చేస్తూ తన తండ్రి మృతి చెందారని, ఆయన ఉద్యోగం తనకు ఇప్పించాలని జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌కు చెందిన ఒడ్డె పేటన్న అర్జీ సమర్పించాడు. 14 నెలలకు సంబంధించిన గౌరవ వేతనం ఇప్పించాలని కొటాల మండలం గుడ్లబోరి సర్పంచ్‌ పాలె రాందాస్‌ అధికారులకు వినతిపత్రం అందించాడు. రెండేళ్లుగా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో దోభీగా పని చేస్తున్న తనను విధుల నుంచి తొలగించారని, మళ్లీ అవకాశం కల్పించాలని జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌ వేడుకున్నాడు. దహెగాం మండలం కమ్మర్‌పల్లి శివారులోని భూమిలో గిరి వికాస్‌ పథకం కింద రెండేళ్ల కింద వేసిన బోరుకు విద్యుత్‌ కనెక్షన్‌ ఇప్పించాలని దహెగాం మండల కేంద్రానికి చెందిన నల్ల దామోదర్‌ కోరాడు. ఎనిమిదేళ్లుగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహం నైట్‌ వాచ్‌ఉమెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నానని, ఉద్యోగ సమస్యను పరిష్కరించాలని సులోచన విన్నవించింది. కాగజ్‌నగర్‌ మండలం నజ్రుల్‌నగర్‌లో ఉన్న తన భూమికి నూతన పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని కృష్ణ మండల్‌ దరఖాస్తు చేసుకున్నాడు.

నా భూమిలో జీపీ భవనం



బెజ్జూర్‌ మండలం తలాయి శివారులో సర్వే నం. 64/2/12, 64/2/13లో తనకు ఐదెకరాల భూమి ఉంది. కొందరు కావాలని ఈ భూమిలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం ముగ్గు వేశారు. నా భూమికి ఇప్పటికీ రైతుబంధు వస్తుంది. అధికారులు అక్రమాలను అడ్డుకోవాలి.

– ఆత్రం నీలయ్య, తలాయి, మం.బెజ్జూర్‌

16 నెలల వేతనం పెండింగ్‌

వాంకిడి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 40 ఏళ్లుగా పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నా. నెలకు రూ.6,500 చొప్పున గత 16 నెలల వేతనం పెండింగ్‌లో ఉంది. అధికారులు స్పందించి వేతనం చెల్లించాలి.

– రత్నం పత్రు, సరండి, మం.వాంకిడి

ఉపాధి కల్పించండి



నేను పదో తరగతి వరకు చదువుకున్నా. ప్రస్తుతం కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నా. ఆరోగ్యం సహకరించకపోవడంతో కూలీ పనులకు వెళ్లడం ఇబ్బందిగా మారింది. ఏదైన ప్రభుత్వ కార్యాలయంలో ఉపాధి అవకాశం కల్పించండి.

– సంధ్య, రవిచంద్రకాలనీ

పింఛన్‌ అందించాలి



కంటి చూపు సరిగా లేకపోవడంతో ఏ పని చేయలేకపోతున్నా. ప్రస్తుతం ఆరోగ్యం కూడా సహకరించక అప్పుడప్పుడు ఫిట్స్‌ వస్తున్నాయి. ఇళ్లు గడవడం కష్టంగా ఉంది. అధికారులు చొరవ తీసుకుని సదరం సర్టిఫికెట్‌ ఇప్పించి పింఛన్‌ అందించి ఆదుకోవాలి.

– అబ్దుల్‌ సత్తార్‌, కాగజ్‌నగర్‌

విరాసత్‌ చేయించాలి



భూపాలపట్నం శివారులో సర్వే నం.82లో తన తల్లి ఫరత్‌ ఖన్నమ్‌ పేరు మీద 15ఎకరాల 960 సెంట్ల భూమి ఉంది. మేము ఏడు మంది సంతానం. సదరు భూమిని ప్రొహిబిటెడ్‌ జాబితా నుంచి తొలగించి విరాసత్‌ చేయించాలి.

– మహ్మద్‌ ముజీద్‌ హైమద్‌, కాగజ్‌నగర్‌

పీవీటీజీల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి

ఆసిఫాబాద్‌అర్బన్‌: ప్రధానమంత్రి జన్‌మన్‌ పథకం కింద జిల్లాలోని పీవీటీజీల అభివృద్ధికి కృషి చేయాలని అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం డీఆర్‌వో సురేశ్‌తో కలిసి జిల్లా పరిషత్‌, గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ, మిషన్‌ భగీరథ, పంచాతీరాజ్‌ ఇంజినీరింగ్‌, గిరిజన సంక్షేమ, విద్యుత్‌ శాఖలు, బ్యాంకు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఎం జన్‌మన్‌ పథకంలో భాగంగా పీవీటీజీ కుటుంబాల్లో ప్రతిఒక్కరికి బ్యాంకు ఖాతాలు తెరిపించాలని, మహిళలకు స్త్రీనిధి రుణాలు అందించాలన్నారు. ఆవాస గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, రహదారులు అనుసంధానం చేస్తూ అంతర్గత రహదారులు నిర్మించాలని ఆదేశించారు. ఆదివాసీ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఇంటర్నెట్‌ సౌకర్యం కల్పించాలని సూచించారు.

క్లుప్తంగా

కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తి రిమాండ్

దహెగాం: పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఈ నెల 24న మండలంలోని కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల జ్యోత్స్న తన భర్త తాగి గొడవ చేస్తున్నాడని 100కు డయల్ చేసింది. విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సంతోష్ గ్రామానికి వెళ్లి విచారణ చేస్తుండగా సదరు మహిళ భర్త దత్తాత్రేయ కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించడంతో పాటు అతని బైక్‌ను ధ్వంసం చేశాడు. కానిస్టేబుల్ సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇరువురిపై కేసు

కాసిపేట: మండలంలోని కోమటిచేను శివారులో చికెన్ సెంటర్ నిర్వాహకుడు రాంటెంకి శివరాం, డెప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌నాయక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు. సోమవారం చికెన్ సెంటర్ ముందు పొయ్యిల కట్టెలు పెడితే ఇక్కడ ఎందుకు పెట్టావ్ అంటూ కర్రతో దాడి చేయడంతో గాయాలైనట్లు శివరాం ఫిర్యాదు చేశాడు. ఇదే సంఘటనపై రెండు రోజుల క్రితం పొయ్యిల కట్టెలు రోడ్డుమీద కాకుండా వెనకాల ఉంచుకోవాలని చెప్పానని, సోమవారం కూడా కట్టెలు ఎందుకు ఉంచావని ప్రశ్నించడంతో బూతులు తిడుతూ బైక్ కీ లాక్కుని సెల్‌ఫోన్ కిందపడేశాడని డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్ ఫిర్యాదు చేశాడు. ఇరువురి ఫిర్యాదులు స్వీకరించి ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు

ఆసిఫాబాద్‌అర్బన్: హత్య కేసులో ఒకరికి ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవి.రమేశ్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు లైజనింగ్ అధికారి ఎస్సై కె.సాగర్, కాగజ్‌నగర్ సబ్ డివిజన్ లైజనింగ్ అధికారి బాబాజీ (హెడ్ కానిస్టేబుల్) తెలిపిన వివరాల ప్రకారం 2022లో కాగజ్‌నగర్‌లోని గుంటూరు కాలనీకి చెందిన మునిగల సదానందంను సర్‌సిల్క్ కాలనీకి చెందిన ఉయ్యాల గోపి హత్య చేయడంతో కేసు నమోదైంది. పీపీ జగన్‌మోహన్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా అప్పటి ఐవోలు కె.రవీందర్ సీఐ, డి.సాగర్ ఎస్సై విచారణ జరపగా నేరం రుజువు కావడంతో నిందితునికి ఐపీసీ సెక్షన్ 302 ప్రకారం ఏడేళ్ల జైలు శిక్ష విధించారు.

అధికారుల సంఘం అధ్యక్షుడికి సన్మానం



వెంకటేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడిగా ఎన్నికైన ఏరియా క్వాలిటీ ఇన్‌చార్జి కే.వెంకటేశ్వర్‌రెడ్డిని సోమవారం మాజీ సర్పంచ్ మల్లెత్తుల రాజేంద్రపాణి, తదితరులు సన్మానించారు. ముందు కూడా మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బండి తిరుపతి, గోపతి తిరుపతి, రాజేశ్వర్ రెడ్డి, పాఠశాల సంఘం జిల్లా అధ్యక్షుడు రేగల ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో రక్తహీనత పరీక్షలు

- 8 నుంచి పదో తరగతి వరకు స్క్రీనింగ్
- ఇంటర్ విద్యార్థులకు కూడా..
- జిల్లాలో ఎనిమిది ప్రత్యేక వైద్యబృందాలు
- 28 వేల మందికి పరీక్షలు



భీమారం(జైపూర్) కేజీబీవీలో విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యబృందం

మంచిర్యాలఅర్బన్: 'అనీమియా ముక్తాభారత్' కార్యక్రమంలో భాగంగా సర్కారు బడుల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎనిమిదో తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులతో పాటు ఇంటర్ విద్యార్థులకు స్క్రీనింగ్ చేస్తున్నారు. సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల శరీరంలో ఐరన్ లోపించడం, తగినన్ని ఎర్రరక్త కణాలు లేకపోవడం వలన అలసట, నీరసం, చర్మం పాలిపోయి ఉండడం, తదితర లక్షణాలు రక్తహీనత కలిగిన వ్యక్తుల్లో కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో రక్తహీనత గుర్తించి వైద్యచికిత్సలు అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 25 నుంచి మంచిర్యాల జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు వైద్యబృందం నేరుగా వెళ్లి విద్యార్థులకు స్క్రీనింగ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు 2,400 మంది విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు పూర్తి చేసినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు.

జిల్లాలో ప్రత్యేక బృందాలు ..

రక్తహీనత పరీక్షల కోసం జిల్లాను యూనిట్‌గా తీసుకుని మండలాల వారీగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ అనిత పర్యవేక్షణలో ఇద్దరు వైద్యులు, ఫార్మసిస్టు, ఏఎన్ఎంతో కూడిన ఎనిమిది బృందాలు ఏర్పాటు చేశారు. వారికి ఎనిమిది హిమోగ్లోబిన్ మీటర్లు అందించారు. ఆయా సర్కారు పాఠశాలల్లో విద్యను అభ్యసించే ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థులకు, కళాశాలల్లో చదివే ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 28 వేల హిమోగ్లోబిన్ కిట్లు పంపిణీ చేశారు. ఇప్పటికే 2,400 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ చేశారు. స్వల్పంగా, మధ్యస్థంగా, తీవ్రంగా ఉన్న విద్యార్థులను గుర్తిస్తున్నారు. మూడో కేటగిరీలో ఉన్న (6 గ్రాముల కంటే తక్కువ రక్తం) వారిని వెంటనే జిల్లా వైద్యాస్పత్రికి తరలించి రక్తం ఎక్కించనున్నారు. 6 గ్రాముల కంటే ఎక్కువ రక్తం ఉన్నా వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. రక్తహీనత లోపం కలిగిన విద్యార్థులు ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువ మొత్తంలో తీసుకోవడం వల్ల సమస్య తీవ్రత నుంచి బయట పడవచ్చని వైద్యాధికారులు సూచిస్తున్నారు.



హిమోగ్లోబిన్ మీటర్

విచారించకుండానే కేసు, రిమాండ్

- రహదారిపై బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన
- న్యాయం చేయాలని డిమాండ్



రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు

దండేపల్లి: అన్యమత మార్పిడి విషయంలో జరిగిన వివాదంలో పోలీసులు విచారణ చేపట్టకుండానే కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపడంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లింగాపూర్‌కు చెందిన నంది సుమను మత మార్పిడి చేస్తే అంతా మంచే జరుగుతుందని గ్రామానికి చెందిన కొందరు అన్యమతస్తులు ఒత్తిడి చేశారు. విషయాన్ని భర్త నరేష్‌కు తెలపడంతో ఈ నెల 27న చర్చి పాస్టర్, ఒత్తిడి చేసిన వారితో వాగ్వాదానికి దిగాడు. ఇంతలో నరేష్ తమ్ముడు సురేష్ అక్కడకు చేరుకుని ఎందుకు గొడవ చేస్తున్నారని అనడంతో పాస్టర్‌తో పాటు అన్యమతస్తులు అతన్ని చితక బాదారు. అంతే కాకుండా ఇద్దరిపై దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గతంలో గ్రామానికి చెందిన కొందరు సురేష్‌పై కత్తులతో దాడిచేస్తే 20 రోజుల తర్వాత కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనపై ఇంత తొందరగా స్పందించడంపై బాధిత కుటుంబ సభ్యులు మండిపడ్డారు. పోలీసుల తీరుకు నిరసనగా సోమవారం దండేపల్లి అంబేద్కర్ స్టాచ్ సమీపంలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఎస్సై ప్రసాద్ వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింప చేయించారు. కాగా గతంలో దాడి కేసు ఆలస్యంపై ఎస్సైని సంప్రదించగా మెడికల్ రిపోర్ట్ రావడంలో జాప్యం కావడంతోనే కేసు నమోదు చేయడంలో కొంత ఆలస్యం జరిగిందన్నారు. అనంతరం ఆందోళనకారులు తహసీల్దార్ సంధ్యారాణికి విన్నవించారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్ ఆవరణలో సోమవారం ఏరియా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. క్లబ్ అధ్యక్షురాలు సవితా మనోహర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగరేణి సీఎండీ బలరాంనాయక్ సతీమణి శారదా బలరాంనాయక్, డైరెక్టర్ ఎస్వీకే శ్రీనివాస్ సతీమణి కళ్యాణి శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులకు ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. నాటికలు, నృత్యాలు ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాధాకుమారి, భవాని, కావ్య, శ్రీవాణి, కవిత, ఊర్మిళ, సుప్రియ, సుల్తానా, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు జీఎం అభినందన



అభినందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఇటీవల జరిగిన కోలిండియా హాకీ పోటీల్లో సింగరేణి జట్టు గోల్డ్‌మెడల్ సాధించింది. పోటీల్లో ప్రతిభ కనబర్చిన శ్రీరాంపూర్ ఏరియా క్రీడాకారులు సోమవారం ఏరియా జీఎం సంజీవరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా జీఎం వారిని అభినందించారు. ముందు కూడా మరిన్ని పతకాలు సాధించి సింగరేణి ఏరియాకు పేరు తీసుకు రావాలన్నారు. క్రీడలకు సింగరేణి అధిక ప్రాధాన్యతనిస్తూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ సందర్భంగా జట్టులో పాల్గొన్న ఏరియా క్రీడాకారులను శాలువాతో సత్కరించారు. అనంతరం ఇటీవల నిర్వహించిన డిపార్టుమెంటల్ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ ఎస్కే బాజీసైదా, ఏరియా ఎస్ఓటూ జీఎం కే రఘుకుమార్, ఇందారం ప్రాజెక్టు అధికారి ఎన్.శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఏజెంట్లు గోపాల్‌సింగ్, ఏవీ రెడ్డి, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, ఆర్కే 5 గని మేనేజర్ అబ్దుల్ ఖాదిర్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో ట్రాక్టర్ యజమాని మృతి

బెల్లంపల్లి: ఇటుక, మట్టి ట్రిప్పుల చార్జీల వసూలు విషయంలో ఇద్దరు ట్రాక్టర్ యజమానుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందిన ఘటన సోమవారం బెల్లంపల్లిలో కలకలం రేపింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య, సహచర ట్రాక్టర్ ఓనర్లు తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి మున్సిపాలిటీ హన్మాన్ బస్తీకి చెందిన గాజువేని సంపత్ అలియాస్ శ్రీధర్ (40), రాంనగర్‌బస్తీలో నివాసం ఉంటున్న మహ్మద్ ఖాజా మోహినొద్దీన్ కొంతకాలంగా ట్రాక్టర్ ట్రిప్పుల దందా నిర్వహిస్తున్నారు. ట్రాక్టర్ ట్రిప్పుల చార్జీ వసూలు విషయంలో మూడురోజులుగా ఇద్దరూ తగాదా పడుతున్నారు. ట్రిప్పుకు రూ.50 తగ్గించి ట్రాక్టర్ చార్జీ తీసుకుంటున్నాడని ఖాజా మోహినుద్దీన్ బాబుక్యాంపు బస్తీకి వెళ్లే మార్గంలో సోమవారం శ్రీధర్‌ను నిలదీయడంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. సెంట్రింగ్‌కు సపోర్టుగా వాడే కర్రతో శ్రీధర్ తలపై బలంగా బాదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వన్‌టౌన్ ఎస్సై రమేశ్, ఏఎస్సై తిరుపతి మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుని సోదరుడు గాజువేని శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.



శ్రీధర్ మృతదేహం

ఆటో బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు



గాయపడిన వెంకటేష్

రెబ్బెన(ఆసిఫాబాద్): అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన సోమవారం మండలంలోని రాంపూర్ బస్టాండ్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం సిర్పూర్(టి) మండలంలోని శివపురం గ్రామానికి చెందిన బట్టు వెంకటేష్ పనినిమిత్తం తన ఆటోలో మంచిర్యాలకు బయలుదేరాడు. మార్గమధ్యలో రాంపూర్ బస్టాండ్ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో వెంకటేష్ తలకు తీవ్రగాయాలు కావడంతో 108లో కాగజ్‌నగర్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు మంచిర్యాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సిర్పూర్(టి)కి చెందిన దుర్గం ప్రవీణ్ అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కుష్ఠు రహిత సమాజానికి కృషి చేయాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జీసీ.సుబ్బారాయుడు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు

పాతమంచిర్యాల: కుష్ఠువ్యాధి రహిత సమాజ నిర్మాణం కోసం అందరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జీసీ.సుబ్బారాయుడు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కుష్ఠు వ్యాధి నిర్మూలన అవగాహన పోస్టర్లు, కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'స్పర్శ్ లెప్రసీ అవేర్‌నెస్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జనవరి 30న మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గ్రామాల్లో ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించి వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించి కుష్ఠు నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించాలన్నారు. మిగతా రోజుల్లో పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నీరజ, డాక్టర్ అనిత, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ హెల్త్ అధికారి లింగారెడ్డి, డీపీఎంవోలు శివకుమార్, రాఘవయ్య, హెల్త్‌అసిస్టెంట్ సునీల్ పాల్గొన్నారు.

వేటగాళ్ల అరెస్టు



నిందితుల అరెస్ట్ చూపుతున్న అధికారులు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని చీలపల్లి ఈస్ట్ బీట్‌లో చుక్కల దుప్పిని హతమార్చిన వేటగాళ్లను అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. సోమవారం కార్యాలయంలో అధికారులు వివరాలు వెల్లడించారు. దుప్పిని హతమార్చిన నలుగురిలో ప్రధాన నిందితుడు ఎండీ షాకీర్ పరారీలో ఉండగా దుర్గం సునీల్, దుర్గం సాయి, చెర్ల రాహుల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితులను సిర్పూర్ కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

వారానికి నాలుగు రోజులే విధులు

- మంగళవారం వచ్చి శుక్రవారం వెళ్తున్న కమిషనర్
- స్థానికంగా ఉండాలన్న నిబంధనలు తుంగలో..



మూసి ఉన్న కమిషనర్ చాంబర్



చెన్నూర్ మున్సిపల్ కార్యాలయం

చెన్నూర్: పట్టణాభివృద్ధిలో కీలక భూమిక పోషించే అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో అభివృద్ధికి విఘాతం కలుగుతోంది. సోమవారం 'సాక్షి' చెన్నూర్ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లగా కమిషనర్ చాంబర్ మూసి ఉంది. సారూ లేరా? అని అక్కడున్న సిబ్బందిని అడిగితే లీవులో ఉన్నారని సమాధానం ఇచ్చారు. బయటికి వస్తుండగా అక్కడే వేచి ఉన్న కొంతమంది కమిషనర్ గంగాధర్ తీరుపై ఏకరువు పెట్టారు. సారు ఎప్పుడు వస్తాడో? తెలియడం లేదన్నారు. మంగళవారం వచ్చి శుక్రవారం మధ్యాహ్నం వరకు ఉండి వెళ్లిపోతున్నాడని ఆరోపించారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అత్యవసర సమావేశాలు ఉంటే తప్ప కార్యాలయంలో వారానికి మూడు రోజులు ఉన్న దాఖలాలు లేవని పలువురు కౌన్సిలర్లు కూడా పేర్కొనడం గమనార్హం. మీరు స్థానికంగా ఉండాలని కౌన్సిలర్లు సూచిస్తే నేను ఇక్కడ పనిచేయను.. వెళ్లిపోతాను.. పంపించండి.. అంటుండడంతో కౌన్సిలర్లు మాట్లాడలేని పరిస్థితి.

మున్సిపల్‌గా ఏర్పడిన నాటి నుంచి..

2 ఆగష్టు 2018లో చెన్నూర్ మున్సిపాలిటీగా ఏర్పడింది. ఆరేళ్ల కాలంలో ఏడుగురు కమిషనర్లు మారారు. ఏ ఒక్కరూ రెండేళ్లు పనిచేసిన దాఖలాలు లేవు. ప్రస్తుతం ఉన్న గంగాధర్‌ది నిజామాబాద్. చెన్నూర్ నిజామాబాద్‌కు దూరం కావడంతో వారానికి నాలుగు రోజులు ఉంటూ మూడురోజులు నిజామాబాద్ వెళ్తున్నారు. అతను సైతం ఇక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయమై మున్సిపల్ ఏఈ సాయికిరణ్‌కు వివరణ కోరగా కమిషనర్ సోమవారం లీవులో ఉన్నారన్నారు. లీవు లెటర్ ఇచ్చారా? అని అడిగితే ఈ రోజు వస్తారని, మళ్లీ కొంత సమయానికి ఈ రోజు నాకు చార్జి ఇచ్చారని సమాధానం ఇచ్చారు. రేపు వస్తారా? అని అడిగితే ఏమో నాకు తెలియదు అంటూ ఏఈ సమాధానం ఇచ్చారు.

స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు ఎంపిక



కొట్టె శ్రావ్య, కోటపల్లి



నల్లగుంట శ్రావణి, సుపాక



సుందిళ్ల శశికళ, మల్లంపేట



మహేశ్, నక్కలపల్లి

కోటపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు ఇటీవల నిర్వహించిన పరీక్ష ఫలితాలు ఆదివారం వెలువరించారు. కోటపల్లి మండలంలోని సుపాక గ్రామానికి చెందిన నల్ల గుంట శ్రావణి, మల్లంపేటకు చెందిన సుందిళ్ల శశికళ, నక్కలపల్లికి చెందిన మహేశ్, కోటపల్లికి చెందిన కొట్టె శ్రావ్య ఉద్యోగాలు సాధించారు.

జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట వరలక్ష్మి జిన్నింగ్ మిల్లులో సోమవారం స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే నీటితో మంటలను ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

క్రీడాకారులకు సన్మానం



సన్మానిస్తున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్: ఈ నెల 18 నుంచి 21 వరకు భూపాలపల్లి ఏరియాలో నిర్వహించిన కోలిండియా హాకీ పోటీల్లో మందమర్రి ఏరియాకు చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్ శివకృష్ణ (కేకే-5), బదిలీ వర్కర్ శనిగారపు కిరణ్ (కేకే-5) ఉత్తమ ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్స్ సాధించారు. సోమవారం ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం మనోహర్ వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ఓరియంట్' కార్మికులకు అవగాహన



ప్రదర్శన పరిశీలిస్తున్న ఆర్డీవో హరికృష్ణ

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపనీలో సోమవారం విపత్తు సమయంలో మనిషిని రక్షించే విషయాలపై ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు కార్మికులకు అవగాహన కల్పించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ విజయవాడ కమాండర్ బితేన్‌సింగ్ తన 15 మంది బృందం సభ్యులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ భోజన్న, ఫైర్ సేఫ్టీ, కంపనీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి

- మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాజకీయాలకు అతీతంగా మున్నూరుకాపులు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని మున్నూరు కాపు సంఘ జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మున్నూరుకాపు సంఘం క్యాలెండర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కుల సంఘం బలోపేతం జరిగితేనే భవిష్యత్తులో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టే అవకాశం కలుగుతుందన్నారు. మున్నూరు కాపులు ఏకతాటిపైకి వస్తే రాజకీయంగా ఎదగడంతోపాటు అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తామన్నారు. విద్యార్థులకు నోట్‌బుక్కులు, మున్నూరు కాపు ఆడబిడ్డ పెళ్లికి పుస్తె, మెట్టెలు, పట్టువస్త్రాలు ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని కులబాంధవులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్ట లక్ష్మణ్, నియోజకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూముల నరేశ్, ఉపాధ్యక్షులు పూదరి తిరుపతి, అగ్గి సత్యం, జంగంపల్లి బాపు, బోయిని శ్రీనివాస్, పూరెళ్ల పోచమల్లు, సత్యనారాయణ, డేగ బాపు, యూత్ అధ్యక్షుడు శ్రీపతి సురేశ్ పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టంపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ బి.సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజలకు పౌరహక్కులు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టంపై అవగాహన ఉండాలని, ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు ప్రవీణ్, డీసీపీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, మంచిర్యాల ఆర్డీవో రాములు, మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు తిరుపతిరెడ్డి, మోహన్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి ఉప సంచాలకులు రవీందర్‌రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అట్రాసిటీ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కమిటీ సభ్యుల ప్రతిపాదన మేరకు మందమర్రి మండలం ఎర్రగుంటపల్లెలో, దండేపల్లి మండలం లింగాపూర్ అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులను మూసి వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సీకార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, జిల్లా వయోజ న విద్యాధికారి పురుషోత్తం, కమిటీ సభ్యులు వెంకటేశం, అంజయ్య, సత్యనారాయణ, లింగయ్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాధవన్, సరోజ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

యువజన అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా వంశీకృష్ణ



చెన్నూర్: నెహ్రూ యువకేంద్రం యువజన అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా చెన్నూర్ పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు వంశీకృష్ణ నియమితులయ్యారు. వంశీకృష్ణ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి అధిష్టానం అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా నియమించింది. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన పార్టీ పెద్దల నమ్మకాన్ని నిలబెడతానని వంశీకృష్ణ తెలిపారు.